సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 7 । జూన్ । 2024



'అధిక' సాంద్రత.. లాభం

అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేస్తే దిగుబడి పెరిగి చీడపీడల నివారణకు అవకాశాలు ఉంటాయని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివకృష్ణ తెలిపారు. 8లో▸



బడిబాట షురూ

జిల్లాలో గురువారం బడిబాట కార్యక్రమం మొదలైంది. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని గ్రామాల్లో చైతన్యర్యాలీలు నిర్వహించారు. అవగాహన కల్పించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
37.0 /28.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురు గాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

సీఎంఆర్ లక్ష్యం పూర్తి చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని రైస్‌మిల్లుల సామర్థ్యం మేరకు కేటాయించిన సీఎంఆర్ లక్ష్యసాధన వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఉమారాణి, మేనేజర్ గోపాల్‌తో కలిసి రైస్‌మిల్లుల యజమానులతో సీఎంఆర్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ రైస్‌మిల్లుల సామర్థ్యం మేరకు నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఆయా రైస్‌మిల్లుల్లో హమాలీ కొరత, యంత్రాల మరమ్మతు ఇతరత్రా కారణాలతో సంబంధం లేకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించుకుంటూ కృషి చేయాలని తెలిపారు. నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు, రైస్‌మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

14న జెడ్పీ సర్వసభ్య సమావేశం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 14న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10.30గంటలకు నిర్వహించే సమావేశానికి సభ్యులు హాజరు కావాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు తమ తమ శాఖల ప్రగతి నివేదికలతో పాల్గొనాలని సూచించారు.

'పది' పరీక్షలకు 30 మంది గైర్హాజరు

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు గురువారం 30 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మూడోరోజు ఇంగ్లిష్ సబ్జెక్టుకు 141 మందికి గాను 111 మంది హాజరయ్యారు. 30 మంది విద్యార్థులు హాజరు కాలేదు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలఅర్బన్: శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఇటీవల ఉత్తమ మార్కులు సాధించిన శ్రీవైష్ణవ విద్యార్థుల నుంచి ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అనంతాచార్యులు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పేరు, చిరునామా, సాధించిన మార్కులు, జీపీఏ, మెమో జత చేయాలని పేర్కొన్నారు. పేద శ్రీవైష్ణవ విద్యార్థులకు 8వ తరగతి నుంచి పై చదువులకు పారితోషికం అందజేస్తామని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 30లోపు స్వయంగా గానీ పోస్ట్ ద్వారా గానీ శ్రీవైష్ణవ సేవా సంఘం తెలంగాణ, శ్రీవైష్ణవ సదనం రోడ్డు నెంబర్–5 చంద్రపురి కాలనీ, యల్‌బీనగర్, హైదరాబాద్‌కు పంపించాలని కోరారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ముంపు భయం!



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు బైరి ప్రసాద్. చెన్నూరు మండలం కొమ్మెరకు చెందిన ఈయనకు సుందరశాల శివారులో మూడెకరాల భూమి ఉంది. ఏటా పత్తి వేశాక వర్షాలు కురిసినప్పుడు వరదలతో పంటకు నష్టం వాటిల్లుతోంది. మళ్లీ ఈ ఏడాది సాగు చేస్తే ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నాడు.



ఈ రైతు పేరు దందర పెంటయ్య. వేమనపల్లి మండల కేంద్రానికి చెందిన ఈయనకు ప్రాణహిత తీరంలో ఐదు ఎకరాల భూమి ఉంది. గత ఐదేళ్లుగా వరదలతో ముంపునకు గురవుతోంది. ఈసారి మళ్లీ పంట వేసేందుకు భయపడుతున్నాడు.



ఇక్కడ కనిపిస్తున్న రైతు పేరు కుమ్మరి ఓదేలు. కోటపల్లి మండలం అలుగామ. ప్రాణహిత తీరంలో 5.20ఎకరాల భూమి ఉంది. ఏటా నది వరదలతో వేసిన పంట నష్టపోతున్నాడు. ఈసారి మళ్లీ వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న తరుణంలో అధిక వరదలు వస్తే నష్టంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు.



వరద ముంపునకు గురైన పత్తి పంట(ఫైల్)

- నదీ తీర ప్రాంత రైతుల్లో ఆందోళన
- కోడ్ ముగిశాక పరిశీలిస్తామన్న మంత్రి
- శాశ్వత పరిష్కారం చూపాలని విన్నపం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: గోదావరి, ప్రాణహిత నదీ తీర ప్రాంత రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో ఆయా నదులు ఉప్పొంగి సుమారు 25వేల ఎకరాల్లో పంటలను వరద నీరు ముంచెత్తుతుంది. వీటిలో నాలుగు వేల ఎకరాల వరకు పంటలకు పూర్తిగా నష్టం వాటిల్లుతోంది. జిల్లాలో గోదావరి, ప్రాణహిత నదీ తీరం ఉన్న ప్రాంతాల్లో వరద ముంపు తీవ్రత గత నాలుగేళ్లుగా పెరుగుతోంది. వరదలతో పూర్తిగా పంట నష్టపోయిన భూములనే పరిశీలించి అంచనా వేయడంతో తీవ్రత తగ్గుతోంది. రైతులు సాగుకు పెట్టుబడి పెట్టి నష్టపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ సీజన్‌లోనూ అదే పరిస్థితి ఎదురైతే మళ్లీ రైతులకు తీవ్ర నష్టం వాటిల్లనుంది.

నీటి నిల్వతో పరేషాన్

కాళేశ్వరం, అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి వరకు బ్యారేజీల్లో నీటిని వర్షపాతం బట్టి నిల్వ చేసి ఎత్తిపోస్తున్నారు. ప్రస్తుతం కాళేశ్వరం బ్యారేజీ మరమ్మతులు పూర్తయితే మళ్లీ నిల్వ చేస్తారని రైతుల్లో ఆందోళన నెలకొంది. సుమారుగా 10టీఎంసీలకు పైనే నీటిని నిల్వ చేసి ఒక్కసారిగా గేట్లు వదలడంతో నదీ తీర ప్రాంతాలకు నష్టం జరుగుతోంది. గతంలోనూ అధిక వర్షాలకు తీర ప్రాంతాల భూములు కోతకు గురయ్యేవని రైతులు అంటున్నారు. బ్యారేజీల నిర్మాణం తర్వాత తీవ్రత మరింత పెరిగిందని ఆందోళన చెందుతున్నారు. కొత్త సర్కారు ముంపు భూములపై దృష్టి సారించి నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సర్కారుపైనే ఆశలు

గత సర్కారు గోదావరి నదిపై కాళేశ్వరం ఎత్తిపోతల పథకం అందుబాటులోకి తెచ్చినప్పటి నుంచి ఈ తీవ్రత అధికంగా ఉందని రైతులు చెబుతున్నారు. తమ భూములకు పరిహారం చెల్లించడమో లేక ఒడ్డున కరకట్టలు నిర్మించడమో చేయాలని కోరుతున్నారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లోనూ సమస్య పరిష్కారానికి నాయకులు హామీలు ఇచ్చారు. ఈ క్రమంలో ఇటీవల చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ రైతులతో వెళ్లి సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి ఇక్కడి పరిస్థితి వివరించారు. వరదలపై శాశ్వత పరిష్కారం చూపించాల్సిందిగా వినతిపత్రం అందజేశారు. రైతుల విజ్ఞప్తి మేరకు ఎన్నికల కోడ్ ముగియగానే ఏదైనా ఇంజినీర్ల బృందాన్ని పంపించి పరిశీలిస్తామని మంత్రి హామీనిచ్చారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడి కోడ్ ముగియడంతో తమ సమస్యకు పరిష్కారం చూపించాల్సిందిగా రైతులు కోరుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు సైతం దృష్టి సారించి తమ సాగు భూములకు వరదలతో ఇబ్బందులు లేకుండా చూడాలని విన్నవిస్తున్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే వివేక్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన వివేక్ కుటుంబ సభ్యులు

చెన్నూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి గురువారం తన కుటుంబ సభ్యులతో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. వంశీకృష్ణ పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడిగా గెలిచిన సందర్భంగా సీఎంను కలిసి శాలువాతో సన్మానించారు. భారీ మెజార్టీతో గెలు పొందిన వంశీకృష్ణను సీఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో గృహణ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, విశాఖ ఇండస్ట్రీస్ ఎండీ గడ్డం సరోజ పాల్గొన్నారు.



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: సీఎం రేవంత్‌రెడ్డిని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో సీఎం కృషి వల్ల రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గతంలో కన్నా ఎక్కువ సీట్లు సాధించడం హర్షనీయమని పేర్కొన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని ఆకాంక్షించారు.

గ్రూప్–1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

మంచిర్యాలఅగ్రికల్చర్: గ్రూప్–1 సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి టీజీపీఎస్సీ చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి, డీజీపీ రవిగుప్తా, ఇతర ఉన్నతాధికారులు, కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా వ్యవసాయ, విద్య, పంచాయతీ శాఖల అధికారులతో గ్రూప్–1 పరీక్ష నిర్వహణ, ఖరీఫ్ విత్తనాలు, ఎరువులు, మిషన్ భగీరథ, యూనిఫాం తయారీ అంశాలపై సమీక్ష నిర్వహించారు. బయోమెట్రిక్ హాజరుపై ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఓఎంఆర్ షీట్లు, పరీక్ష రాసే విధానంపై తెలియజేయాలని, శుక్రవారం పరీక్ష సంబంధిత పత్రాలు, సామగ్రి స్ట్రాంగ్ రూమ్‌లకు చేరుస్తామని, పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. నకిలీ, నిషేధిత విత్తనాలు, ఎరువుల విక్రయం, వినియోగం జరుగకుండా వ్యవసాయ, పోలీసు శాఖ సమన్వయంతో టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు ఒక జత యూనిఫాం అందజేయాలని, ఈ నెల 11 వరకు సమకూర్చుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ బి.సంతోష్ మాట్లాడుతూ గ్రూప్–1 పరీక్ష నిర్వహణకు జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 9,384 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు సమయానికి చేరుకోవడానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. నకిలీ విత్తనాల నిరోధానికి అవసరమైన చర్యలు చేపట్టామని అన్నారు. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు యూనిఫాం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. యూనిఫాం కుట్టు కేంద్రాలను అధికారులు ప్రతీరోజు సందర్శిస్తూ పురోగతిపై పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, మిషన్ భగీరథ ఈఈ జి.వెంకటేష్, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, విద్యాధికారి యాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి

- డీఈవో యాదయ్య
- జిల్లాలో బడిబాట ప్రారంభం

జన్నారం: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతోపాటు సౌకర్యాలు కల్పిస్తున్నామని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. గురువారం మండలంలోని పొనకల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా పొనకల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈవో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక విద్యార్థులు చేరేలా కృషి చేయాలని అన్నారు. పదో తరగతి, ఉపకార వేతనాలు, గురుకుల ఎంపిక ఫలితాల్లో జన్నారం మండలం ముందుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, ఉచిత పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజన పథకాలపై వివరించాలని తెలిపారు. బడిబాట ర్యాలీలో ఐదేళ్లు నిండిన ఐదుగురు విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఈ సమావేశంలో ఎంఈవో విజయ్‌కుమార్, ఎంపీడీవో శశికళ, ఎస్సెస్సీ కోఆర్డినేటర్ చౌదరి, ఎంపీవో రమేశ్, ప్రధానోపాధ్యాయులు జనార్దన్, కట్ట రాజమౌళి, శ్రీనివాస్, రామన్న, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.



పొనకల్‌లో ర్యాలీలో పాల్గొన్న డీఈవో

అంగన్‌వాడీ.. ప్రీ స్కూళ్లు

- ప్రభుత్వ పాఠశాల భవనాల్లో నిర్వహించే వాటిలో మొదలు
- వివరాలు సేకరించిన రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ
- త్వరలోనే మార్పునకు శ్రీకారం



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బోధిస్తున్న అంగన్‌వాడీ టీచరు

మంచిర్యాలటౌన్: చిన్నారులకు పౌష్టికాహారం, ఆటపాటలతో కూడిన విద్యనందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలు(ప్రీ స్కూల్స్)గా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకోసం అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటిని మినహాయించి ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో నిర్వహిస్తున్న కేంద్రాలను ప్రీ స్కూల్స్‌గా మార్చాలనే ఉద్దేశంతో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు జిల్లాల నుంచి వివరాలు సేకరించింది. జిల్లాలోనూ ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న 291 అంగన్‌వాడీ కేంద్రాల వివరాలను జిల్లా అధికారులు ప్రభుత్వానికి పంపించారు. అన్ని జిల్లాల నుంచి వివరాల సేకరణ అనంతరం అవసరమైన సదుపాయాల కోసం నిధులు కేటాయించి పనుల ప్రారంభానికి సన్నద్ధమవుతోంది. జాతీయ విద్యావిధానం 2020కి అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీస్కూల్‌గా తీర్చిదిద్దితే ఇక చిన్నారులకు పౌష్టికాహారంతోపాటు పూర్వ ప్రాథమిక విద్య అందే అవకాశం ఉంది.

జిల్లా వివరాలు				
ప్రాజెక్టు	అంగన్‌వాడీ కేంద్రాలు	ప్రభుత్వ పాఠశాలలో ఉన్నవి	అద్దె భవనాలు	స్వంత భవనాలు
బెల్లంపల్లి	279	84	113	82
చెన్నూరు	245	74	135	36
లక్సెట్టిపేట	203	104	59	40
మంచిర్యాల	242	29	183	30
మొత్తం	969	291	490	188

చిన్నారులకు అందనున్న విద్య

ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల్లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందిస్తూనే చిన్నారులకు పౌష్టికాహారంతోపాటు ఆటపాటలతో కూడిన విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. పూర్వ ప్రాథమిక విద్య అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో సీడీపీవోలు, సూపర్‌వైజర్లకు ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్‌పై అవగాహన కల్పించి, గుర్తించిన అంగన్‌వాడీ కేంద్రాల్లోని టీచర్లకు శిక్షణకు ఆ శాఖ సిద్ధమైంది. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు ప్రభుత్వమే అందిస్తుండగా, అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభిస్తే పుస్తకాలు, పఠన సామగ్రి, బుక్ ర్యాక్స్ వంటివి అవసరం ఉంటాయి. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ఆయా కేంద్రాలకు నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. ప్రీ స్కూల్స్‌లో విద్యాబోధనకు టీచర్లకు శిక్షణ అవసరం కావడంతో, శిక్షణ ఇచ్చి వారితోనే ఆయా కేంద్రాలు నిర్వహించనున్నట్లు తెలిసింది. 65 ఏళ్ల పైబడిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల రిటైర్మెంట్‌పై ప్రభుత్వం పరిశీలన చేస్తుండడంతో జిల్లాలో 65 ఏళ్ల నిండిన టీచర్లు 17 మంది, ఆయాలు 110 మంది ఉన్నారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా టీచర్ పోస్టులు 76, ఆయా పోస్టులు 240 ఖాళీలు ఉండగా, రిటైర్మెంట్‌తో అవి మరింత పెరిగే అవకాశం ఉంది. రిటైర్మెంట్ అవుతున్న వారిలో టీచర్లు, హెల్పర్లు పదో తరగతి అర్హతతోనే విధుల్లో చేరినవారే. ఖాళీ పోస్టుల భర్తీ కోసం ఇంటర్మీడియెట్‌ను కనీస అర్హత తీసుకుని నూతనంగా టీచరు, ఆయా పోస్టులను భర్తీ చేయడం వల్ల ప్రీస్కూల్స్‌లో విద్యాబోధన చేపడితే చిన్నారులకు లబ్ధి చేకూరుతుంది.

చిన్నారులకు లబ్ధి



గతంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందించడం మాత్రమే లక్ష్యంగా పనిచేస్తుండేది. కానీ విద్యావ్యవస్థలో మార్పులకు అనుగుణంగా చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందించడం, ఇంగ్లిషు, తెలుగు అక్షరాలు, పాటలు, గేయాలు నేర్పిస్తున్నారు. ఆటవస్తువులతో వారిలో నైపుణ్యం పెంపొందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాల వివరాలను ప్రభుత్వం సేకరించడంతో త్వరలోనే పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించేందుకు అవకాశం ఉంది.

– చిన్నయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి, మంచిర్యాల

'ప్రత్యేక'ంలోనే వైద్యం మెరుగు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి రాష్ట్రంలో కంటే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనే వైద్యం ఎంతగానో మెరుగుపడిందని, వైద్యులు, సిబ్బంది సంఖ్య పెరగడంతోపాటు ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పన, జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కళాశాల, మాతాశిశు ఆరోగ్య కేంద్రం, డివిజన్‌కు ఒక డయాలసిస్ కేంద్రం ఏర్పాటుతో ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా నాణ్యమైన వైద్యం అందుతోందని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్, రిటైర్డు సివిల్ సర్జన్ స్పెషలిస్టు ఆర్థో వైద్యుడు డాక్టర్ అరవింద్ తెలిపారు. 'సాక్షి' ఇంటర్వ్యూలో వైద్యంపై పలు అంశాలు వివరించారు.



డాక్టర్ అరవింద్



ఉమ్మడి, ప్రత్యేక రాష్ట్రంలో వైద్య సేవల్లో ఏ విధంగా మార్పులు వచ్చాయి?

డాక్టర్ అరవింద్: ఉమ్మడి రాష్ట్రంలో వైద్యులు, సిబ్బంది సంఖ్య చాలా తక్కువగా ఉండేది. మౌలిక వసతులు అంతంత మాత్రంగానే ఉండడం, ప్రజల్లో ప్రభుత్వ వైద్యంపై సరైన అవగాహన లేకపోవడం, సీజనల్ వ్యాధుల వంటివి జిల్లావ్యాప్తంగా ఎక్కువగా నమోదయ్యేవి. ప్రత్యేక రాష్ట్రంలో 17 ఏళ్లు ప్రభుత్వ వైద్యుడిగా తాను పనిచేస్తున్నప్పుడు నలుగురు వైద్యులే ఉంటే, తెలంగాణ రాగానే ఆ సంఖ్య తొమ్మిది మందికి పెరిగింది. ఆ తర్వాత ఆసుపత్రి ఎక్కడ ఉంటే అక్కడ ఓ వైద్యుడు తప్పనిసరిగా నియామక చేయడంతోపాటు అవసరాన్ని బట్టి సిబ్బందిని పెంచారు. వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకోవడం, అవసరమైన వారికి మందులు అందించడం వల్ల వైద్యం మెరుగుపడేలా చేసింది.

వైద్యరంగంలో వచ్చిన భారీ మార్పులు ?

డాక్టర్ అరవింద్: ప్రతీ జిల్లాకు ఒక ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు, అన్ని విభాగాలకు ఐదు మందికి పైగా వైద్యులు వచ్చారు. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వంటి వైద్యులు జిల్లా కేంద్రానికి వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు. మాతాశిశు ఆరోగ్య కేంద్రం ఏర్పాటుతో ప్రసవాలు, చిన్నారులకు వైద్య సేవలు ప్రత్యేకంగా అందించేందుకు అవకాశం ఉంది. గర్భిణుల కష్టాలకు చెక్ పడింది. గర్భిణులను ఇంటి నుంచి ఆసుపత్రికి తీసుకొచ్చేందుకు, ప్రసవం తర్వాత ఇంటి వద్ద దించడానికి 102 వాహనాలతో ఎంతో మేలు జరుగుతోంది.

సేవలు ఎందులో మెరుగయ్యాయి?

డాక్టర్ అరవింద్: జిల్లావ్యాప్తంగా ఎక్కువ మంది కిడ్నీ వ్యాధికి గురై డయాలసిస్ కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గతంలో కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి రోగులు డయాలసిస్ చేసుకునేవారు. డయాలసిస్ చేసుకోలేని స్థితిలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు స్థానిక ఆసుపత్రికి వచ్చి మృత్యువాత పడ్డవారు వందల సంఖ్యలో ఉన్నారు. జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయగా, ఇప్పుడు డివిజన్‌కు ఒకటి చొప్పున డయాలసిస్ కేంద్రం ఏర్పాటుతో వ్యాధిగ్రస్తులకు రక్తశుద్ధి సులభంగా మారింది. వ్యాధిగ్రస్తులకు రవాణా, ఆర్థిక భారం తగ్గింది.

వైద్య రంగంలో ఇంకా మెరుగు పడాల్సినవి..

డాక్టర్ అరవింద్: అత్యవసర వైద్యం అందించే ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటులో తాత్సారం జరుగుతోంది. అన్ని జిల్లాలను కలుపుతూ హైవేల నిర్మాణాలు జరుగుతున్నాయి. హైవేలతోపాటు ఇతర ప్రాంతాల్లోనూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రతీ జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో ఒక ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తే రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మృత్యువాత పడకుండా ఎంతోమందిని కాపాడే అవకాశం ఉంటుంది. ఐసీయూలో బెడ్ల సంఖ్య పెంచాలి. కనీసం 100 బెడ్లతో ఐసీయూలు ఏర్పాటు చేస్తే అత్యవసరంగా వచ్చే రోగులు, ఆత్మహత్యాయత్నం చేసిన వారికి వెంటనే చికిత్స అందించి ప్రాణాలు కాపాడవచ్చు.

వైద్యులకు ఇంకా ఎలాంటి సహకారం అందాలి

డాక్టర్ అరవింద్: నిత్యం వైద్యులతో సమావేశాలు ఎక్కువ సేపు నిర్వహించడం వల్ల కొంత ఇబ్బందిగా మారుతోంది. వైద్య వృత్తిలో అత్యవసరమైన సమయాల్లో వైద్యం అందించాల్సి ఉంటుంది. సమావేశాల పేరిట వైద్యుల సమయాన్ని వృథా చేయకుండా, తక్కువ సమయంలోనే సూచనలు ఇచ్చేలా చూడాలి. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకునేలా ప్రభుత్వం చొరవ చూపాలి. రోగులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు సరిపడా వైద్యులు ఉన్నా వారికి అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచాలి.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

లక్సెట్టిపేట: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారంరెడ్డి అన్నారు. గురువారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల చెట్లుగా ఎదిగి, పర్యావరణాన్ని కాపాడుతూ వర్షాలు కురిసేందుకు ఉపయోగపడుతాయని తెలిపారు. వృక్షాలే జీవకోటికి మూలాధారమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సీనియర్ సివిల్ జడ్జి

క్లుప్తంగా

బీట్ అధికారిపై దాడి కేసులో ముగ్గురి అరెస్ట్

జన్నారం: ఈ నెల 2న తపాలాపూర్ చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న బీట్ అధికారి సాయికుమార్, వాచర్ ఉత్కూరి శ్రీనివాస్‌పై దాడికి పాల్పడిన ముగ్గుర్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. దండెపల్లి మండలం మేదరిపేటకు చెందిన ఆడెపు శ్రావణ్‌కుమార్, నర్సాపూర్‌కు చెందిన తీగల్ ఉదయ్, నెల్కి వెంకటాపూర్‌కు చెందిన దొరిసెట్టి శ్రీనివాస్‌లను గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని దొరగారి పల్లెలో ఓ వృద్ధుడు మృతి చెందగా మృతదేహం కుళ్లిపోయిన సంఘటన చోటు చేసుకుంది. మృతుని కుమారుడు మల్లేశ్ తెలిపిన వివరాల మేరకు గ్రామంలో నివాసం ఉంటున్న బోరె గంగయ్య(80) ఈ నెల 2న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. గురువారం మృతుని ఇంటి పరిసరాల నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వచ్చి పోలీసులు పరిశీలించగా మృతదేహం కుళ్లిపోయి ఉంది. మూడు రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుని భార్య 2014లోనే మృతి చెందగా కుమారుడు మల్లేశ్ 15 రోజుల క్రితం హమాలివాడలోని ఓ ఇంట్లో అద్దెకు దిగాడు. ఇంట్లో ఒంటరిగా ఉండడంతో మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రెండో ఎస్సై

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని గంపలపల్లి గ్రామానికి చెందిన చంద మీనమ్మ (76) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. గంపలు అమ్ముకుని జీవనం సాగిస్తున్న మీనమ్మ గురువారం పట్టణంలో గంపలు అమ్ముకుని ఇంటికి తిరిగివస్తున్నక్రమంలో ఉత్కూర్ చౌరస్తా వద్ద ఎన్టీఆర్‌చౌక్ వైపుకు వెళ్తున్న ఆటో వెనకనుంచి ఢీకొట్టింది. కిందపడిపోవడంతో గమనించిన స్థానికులు ముందుగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యంకోసం మంచిర్యాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గుప్తనిధుల పేరుతో మోసగించిన వ్యక్తి అరెస్టు

సిర్పూర్(టి): గుప్తనిధులు వెలికి తీస్తానని నమ్మించి మోసగించిన వ్యక్తిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై డీకొండ రమేశ్ తెలిపారు. కొటాలకు చెందిన మీసాల బాపురావ్ తనకు దేవార వస్తుందని భూత వైద్యంతో పాటు క్షుద్ర పూజలు చేసి గుప్త నిధులు తీసి ఇస్తానని జోజప్ప అనే వ్యక్తిని నమ్మించి మోసగించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

‘అధిక’ సాంద్రత.. లాభం

- పెరగనున్న సాగు విస్తీర్ణం
- తగ్గనున్న కూలీల ఖర్చు


కోట శివకృష్ణ , ప్రోగ్రాం కోఆర్డినేటర్, బెల్లంపల్లి

బెల్లంపల్లి: ఖరీఫ్ సీజన్ సమీపిస్తోంది. రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకాయి. వర్షాల రాకకు ముందస్తుగా వేసవి దుక్కులు దున్ని సేంద్రియ ఎరువులు పోసుకుని పంటల సాగుకు రైతులు చేలను సిద్ధం చేసి ఉంచుకున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో పత్తి ప్రధాన పంటగా పండిస్తున్నారు. పత్తి సాగులో అధిక సాంద్రత విధానం ఎంతో మేలైంది. ఆ తీరుగా పత్తి సాగు చేయడం వల్ల పంట దిగుబడి పెరిగి, చీడ పీడల నివారణకు అవకాశాలు ఉంటాయి. కూలీల ఖర్చు కూడా తగ్గుతుంది. పంట కాలపరిమితి తగ్గి రెండో పంట సాగు చేసుకోవడానికి వీలవుతుంది. అధిక సాంద్రతతో పత్తి సాగు చేయడం వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు ఉంటాయని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కోట శివ కృష్ణ తెలిపారు. వివరాలు ఆయన మాటల్లోనే...

మొక్కల సంఖ్య పెరిగి...

అధిక సాంద్రత పత్తి సాగు సాధారణ పత్తి సాగుకు భిన్నంగా ఉంటుంది. మొక్కల మధ్య, వరుసల మధ్య దూరం తగ్గించి ఎకరాకు ఎక్కువ మొక్కలు వచ్చే విధంగా విత్తు కోవడానికి వీలవుతుంది. సాధారణ పత్తి సాగులో వరుసల మధ్య 90 సెం.మీ, మొక్కల మధ్య 60 సెం.మీ ఎడం పెట్టినప్పుడు ఎకరాకు గరిష్టంగా 7,400 మొక్కలు మాత్రమే వస్తాయి. అదే అధిక సాంద్రత పద్ధతిలో విత్తుకోవడం వల్ల 90 సెం.మీ, మొక్కల మధ్య 15 సెం.మీ ఎడంతో విత్తుకుంటే ఎకరాకు గరిష్టంగా 29,629 మొక్కలు వస్తాయి. ఈ పద్ధతిలో విత్తన మోతాదు ఎకరానికి 2.5 కిలోలు అవసరం అవుతుంది. వర్షాధార తేలిక నేలలు, భూసారం అత్యల్పంగా ఉండే చెలక నేలలకు చాలా అనుకూలం.


అధిక సాంద్రతతో సాగు చేసిన పత్తి పంట (ఫైల్)

అధికసాంద్రత సాగుతో ప్రయోజనాలు

- అధిక సాంద్రత విధానంలో సాగు చేసిన పంట నవంబర్/డిసెంబర్ నెలలో చేతికి వస్తుంది.
- ఒకే సారి పూత, కాత రావడం వల్ల గులాబీ రంగు పురుగు తాకిడి నుంచి పంట బయట పడుతుంది.
- నీటి వసతి ఉన్న చోట రెండో పంట సాగుకు అనుకూలంగా ఉంటుంది.
- డిసెంబర్‌లో పంట తీసిన తర్వాత రెండో పంటగా పెసర, మినుము వంటి అపరాల పంటలను సాగు చేస్తే నేల సారవంతమవుతుంది.
- తర్వాత విత్తుకునే పంటకు ఎరువుల మోతాదు తగ్గించుకునే అవకాశాలు ఉంటాయి.
- రెండో పంట మార్పిడి చేయడం వల్ల నిరంతరంగా పెరిగే గులాబీ రంగు పురుగు ఉధృతిని తగ్గించవచ్చు. ఆ తీరుగా మరుసటి ఏడాది ఆశించే గులాబీ రంగు ఉధృతి తగ్గుముఖం పడుతుంది.
- ఈ పద్ధతి వల్ల ఎకరాకు సుమారు 30 నుంచి 40 శాతం అధిక దిగుబడిని పొందే అవకాశం ఉంది.

అధిక సాంద్రతతో అధిక దిగుబడి

అధిక సాంద్రత విధానంలో పత్తి చదరపు మీటరుకు మొక్కల సంఖ్య పెరిగి ఎత్తును 4 నుంచి 5 అడుగుల వరకు నియంత్రించడానికి వీలవుతుంది. తద్వారా మొక్కలు త్వరగా కాపుకు వచ్చి కాయలు నిలుపుకునే సామర్థ్యం కలిగి ఉంటాయి. ఒకేసారి పత్తి పక్వానికి వస్తుంది. కాయ బరువు అధికంగా ఉంటుంది. తద్వారా ఎకరాకు కనిష్టంగా 8 నుంచి 10 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే వీలుంటుంది. అయితే ప్రాంతాన్ని బట్టి, పాటించే యాజమాన్య పద్ధతిని బట్టి పంట దిగుబడి మారుతూ ఉంటుంది.

అలాంటి నేలల్లో మొక్కలు ఎక్కువ ఎత్తు పెరగవు. తద్వారా మొక్కల సంఖ్య పెరగడంతోపాటు పంట దిగుబడి పెరిగే వీలుంది. 8 నుంచి 10 కాయలు వచ్చిన మొక్కల సంఖ్య అధికంగా ఉండటం వల్ల ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల పంట దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

సాధారణ సాగుతో కలిగే ప్రతికూలతలు

సాధారణ పద్ధతిలో పత్తి సాగు చేయడం వల్ల పలు ప్రతికూల సమస్యలు ఏర్పడే అవకాశం ఉంది. మూడు, నాలుగు సార్లు పత్తి సేకరణకు కూలీల అవసరం ఏర్పడుతుంది. తద్వారా కూలీల ఖర్చు పెరుగుతుంది. సాధారణ పత్తి సాగు కాలపరిమితి ఎక్కువ రోజులు ఉండటంతో రెండో పంట సాగు చేయడానికి వీలు ఉండదు. సాగు వ్యవధి ఫిబ్రవరి, మార్చి వరకు పెంచడం వల్ల పత్తి నాణ్యత తగ్గిపోయే అవకాశాలు అధికంగా ఉంటాయి. మరోవైపు గులాబీ రంగు పురుగు ఉధృతి అధికమయ్యే అవకాశం ఉంటుంది.

ఆటో పార్కింగ్‌స్థలం పరిశీలన


ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఆర్డీవో

బెల్లంపల్లి: బెల్లంపల్లి కూరగాయల మార్కెట్ ప్రాంతంలో కబ్జాకు గురైన గ్రామీణ ప్రాంతాల ఆటో పార్కింగ్ స్థలాన్ని గురువారం ఆర్డీవో పి.హరికృష్ణ పరిశీలించారు. బెల్లంపల్లి మండలంలోని మాల గురిజాల, తాళ్ల గురిజాల, రంగపేట, దుగినేపల్లి గ్రామాల ఆటో డ్రైవర్లు, ఓనర్లు కబ్జాకు గురైన ఆటో పార్కింగ్ స్థలాన్ని తమకు ఇప్పించాలని పలుమార్లు ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, పోలీసు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈమేరకు ఆర్డీవో మార్కెట్ ప్రాంతానికి వెళ్లి ఆక్రమణ దారులతో మాట్లాడారు. వారు స్పందించకపోవడంతో కొంత సమయం తీసుకుని తగిన చర్యలు తీసుకుంటామని ఆటో డ్రైవర్లకు హామీ ఇచ్చారు.

మద్యంమత్తులో వ్యక్తి వీరంగం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఓ ఎలక్ట్రానిక్ షాపులో ఓ వ్యక్తి మద్యం మత్తులో నగ్నంగా తిరుగుతూ వీరంగం సృష్టించాడు. రెండు రోజుల క్రితం స్మార్ట్ టీవీని కొనుగోలు చేసేందుకు వచ్చిన సదరు వ్యక్తి స్టాక్ లేదని చెప్పడంతో రెండు రోజులకు మళ్లీ వచ్చి ఆర్డర్ ఇచ్చిన టీవీ రాకపోవడంతో అతిగా మద్యం సేవించి తిరిగి షాపులోకి వెళ్లి నగ్నంగా తిరుగుతూ నిరసన తెలిపాడు. అక్కడే ఉన్న కుటుంబ సభ్యులు అతని ప్రవర్తన తరచూ ఇలాగే ఉంటుందంటూ బట్టలు వేసి ఇంటికి తీసుకెళ్లారు. అతని మానసిక ప్రవర్తన సక్రమంగా లేదని తెలపడంతో కేసు పెట్టలేదని ఆషాపు యజమాని తెలిపారు.

‘ఏఐటీయూసీకి గుర్తింపుపత్రం ఇవ్వాలి’


మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

కాసిపేట: సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఎన్నికైన ఏఐటీయూసీకి గుర్తింపుపత్రం వెంటనే ఇవ్వాలని యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. గురువారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. 2023–24 సంవత్సరం లాభాల వాటా 35 శాతం చెల్లించాలని, కాలం చెల్లిన ఎస్‌డీఎల్ యంత్రాలను మార్చేసి నూతన యంత్రాలు తేవాలని, ఎస్‌డీఎల్ ఆపరేటర్లకు ప్రమోషన్ ఇవ్వాలని, సొంతింటి పథకం కింద ప్రతీ కార్మికుడికి రెండున్నర గుంటల స్థలం, రూ.20 లక్షల అడ్వాన్స్ యాజమాన్యమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 25 మంది కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సెంట్రల్ సెక్రెటరీ ఎండి అక్బర్‌అలీ, బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, మందమర్రి బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, బెల్లంపల్లి బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, సహాయ కార్యదర్శి దాసరి తిరుపతిగౌడ్, ట్రెజరర్ నాగేశ్వర్‌రావు, పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కార్యదర్శి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

‘కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు ఇప్పించాలి’


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: డివిజన్‌లోని ఎస్సార్పీ1, ఎస్సార్పీ 3, ఐకే 1ఏ గనుల్లో పనిచేస్తున్న మిషన్, చిప్పింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు ఇప్పించాలని కోరుతూ సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బ్రాంచి సెక్రెటరీ ఎస్కే బాజీసైదా ఆధ్వర్యంలో గురువారం ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరు కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి వేతనాలు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, బ్రాంచ్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్, నాయకులు సాయి, శ్రీనివాస్, విజయ్, వెంకటేష్, మల్లేశ్, తిరుపతి, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

డ్యూటీలు చేయకుంటే చర్యలు తప్పవు

- జీఎం సంజీవరెడ్డి


కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: డ్యూటీలు సక్రమంగా చేయకుంటే చర్యలు తప్పవని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. గురువారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో 2021–23 మధ్య ఒక్క మస్టర్ కూడా చేయని ఉద్యోగులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఏడాదిలో నిర్ణీత మస్టర్లు చేయకుంటే కంపెనీ తీసుకునే చర్యలకు బాధ్యులు కావాల్సి వస్తుందన్నారు. ప్రతి ఉద్యోగి ఇదే చివరి అవకాశంగా భావించాలన్నారు. ప్రతి నెల 20 మస్టర్లు నిండేలా పని చేయాలన్నారు. గైర్హాజరు ఎందుకు అయ్యారో కార్మికులను, వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీవైజీఎంవో రమేశ్‌బాబు, డీవైపీఎం రాజేశ్, సీనియర్ పీవోలు కాంతారావు, గౌస్‌పాషా, పాల్ సృజన్, సంతన్, సేవా సెక్రెటరీ కొట్టె జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

సాగులో పాటించాల్సిన పద్ధతులు


లింగంపల్లి సమీపంలో సిద్ధం చేసిన దుక్కి

చెన్నూర్‌రూరల్: వానాకాలం సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ట్రాక్టర్లతో దుక్కులు దున్ని సిద్ధంగా ఉంచుతున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే సాగు విస్తీర్ణం మరింత పెరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్నదాతలు పాటించాల్సిన సలహాలు, సూచనలను చెన్నూర్‌వ్యవసాయాధికారి మార్క్‌గ్లాడ్‌స్టన్ వివరించారు.

రైతులు పాటించాల్సిన సూచనలు

- మేలు రకం విత్తనాలు వాడాలి.
- తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయించాలి.
- పంటచేనులో విత్తన సాళ్ల దూరం పాటించాలి.
- ఏటా పంట మార్పిడి చేయాలి.
- అవసరమైన మేరకే ఎరువులు వాడాలి.
- కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు రశీదులు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలి.
- రైతులు పంట వేసే సమయంలో తప్పని సరిగా వ్యవసాయాధికారులను సంప్రదించాలి.
- సేంద్రియ ఎరువులను వాడితే ఖర్చు ఆదాతో పాటు దిగుబడి పెరుగుతుంది.

మృత్యు పిడుగు

పిడుగు మృత్యువై ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో నలుగురిని బలి తీసుకుంది. వ్యవసాయ పనులకు వెళ్లిన యువ రైతులను కబళించింది. వేర్వేరు ప్రాంతాల్లో గురువారం పిడుగులు పడి దంపతులు, యువ రైతు, బాలుడు మృతి చెందారు. మరోచోట పిడుగుపాటుకు మరో ఇద్దరు గాయపడ్డారు. వీరంతా వ్యవసాయ పనుల్లో ఉండగానే పిడుగులు పడడం గమనార్హం.


ప్రవీణ్ (ఫైల్)


శ్రీ(ఫైల్)


అనక సంతోష్, స్వప్న మృతదేహాలు


అనక సంతోష్, స్వప్న(ఫైల్)

- ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో నలుగురు మృతి
- డొంగర్‌గామ్‌లో దంపతులు బలి..
- దిలావర్‌పూర్‌లో యువరైతు..
- మేకలు మేపేందుకు వెళ్లి బాలుడు..
- మరో ఇద్దరికి గాయాలు...

చేను వద్దకు వెళ్లి శవమై..

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని డొంగర్‌గామ్ గ్రామానికి చెందిన యువ దంపతులు అనక సంతోష్ (27), స్వప్న(24) వ్యవసాయ పనుల నిమిత్తం గురువారం సాయంత్రం చేను వద్దకు వెళ్లారు. పనులు చేస్తుండగా వాతావరణం మారిపోయింది. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దీంతో పనులు ఆపేసి.. సమీపంలో ఉన్న టేకుచెట్టు కింద ఉన్న గుడిసెలోకి వెళ్లారు. ఈ క్రమంలో చెట్టుపై పిడుగు పడడంతో దంపతులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. చేను వద్దకు వెళ్లిన దంపతులు రాత్రయినా ఇంటికి రాకపోవడంతో వర్షం తగ్గిన తర్వాత కుటుంబ సభ్యులు చేనుకు వెళ్లి చూడగా గుడిసెలో ఇద్దరూ శవమై కనిపించారు. దీంతో బోరున విలపించారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అనాథ అయిన ఏడాది చిన్నారి..

సంతోష్, స్వప్న మృతితో వారి ఏడాది వయసున్న కూతురు భాను అనాథ అయింది. తల్లిదండ్రుల మృతదేహాల వద్ద కుటుంబ సభ్యులు రోదిస్తుంటే.. ఆ చిన్నారి ఏం జరిగిందో తెలియక బిత్తర చూపులు చూడడం అందరినీ కదిలించింది. పొలం వద్ద నుంచి వచ్చాక అమ్మ పాలు పడుతుందనుకుంటే.. ఇంకా రాలేదని అమ్మ రాక కోసం ఎదురు చూస్తున్నట్లు చిన్నారి అమాయకపు చూపులు చూసి అందరి కళ్లు చెమర్చాయి.

తండ్రికి సాయం చేద్దామని వెళ్లి యువరైతు..

దిలావర్‌పూర్: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని కాల్వ గ్రామానికి చెందిన యువ రైతు మూడపెల్లి ప్రవీణ్(28) గురువారం తన తండ్రి సాయన్నతో కలిసి పంటపొలాన్ని ట్రాక్టర్‌తో దుక్కి దున్నించేందుకు వెళ్లాడు. ప్రవీణ్ దుక్కిలో జీలుగ చల్లుతుండగా ఉరుములతో కూడిన భారీ వర్షంలో పిడుగుపడడంతో అక్కడే కుప్పకూలాడు. పక్కనే ఉన్న తండ్రి ట్రాక్టర్ డ్రైవర్ సహాయంతో నిర్మల్ తరలించే క్రమంలో మృతి చెందాడు. మృతునికి భార్య అశ్విని, ఏడాది కూతురు ఉన్నారు.

మేకలను మేతకు తీసుకెళ్లి బాలుడు..

తానూరు: మండలంలోని ఎల్వత్‌కు చెందిన మంగీర్‌వాడ్ శ్రీ(10) తన తాతతో మేకలు మేపేందుకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగివస్తుండగా కురిసిన వర్షంలో పిడుగుపడడంతో బాలుడితో పాటు రెండు మేకలు మృత్యువాతపడ్డాయి. సమాచారం తెలుసుకున్న ఎస్సై సందీప్, ఆర్ఐ మోహన్ సింగ్ గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని తండ్రి సాయినాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆకోలిలో ఇద్దరికి గాయాలు

జైనథ్: మండలంలోని ఆకోలిలో పిడుగుపాటుతో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బాబారావ్, సంతోష్ పంటచేనులో పనులు చేస్తుండగా వర్షం కురియడంతో ఓ మామిడి చెట్టు కిందకు వెళ్లి తలదాచుకున్నారు. కొంతదూరంలో పిడుగు పడటంతో సంతోష్ కాలికి గాయంకాగా బాబారావ్ స్పృహ కోల్పోయాడు. సంతోష్ తన భార్యకు ఫోన్ చేసి తాము పిడుగు పాటుకు గురయ్యామని చెప్పడంతో 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

బరంపూర్‌లో ఎద్దు..

తలమడుగు: మండలంలోని బరంపూర్‌లో సంపతి రామన్న యాదవ్ తన పంటచేనులో ఎద్దులను కట్టివేశాడు. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి పిడుగుపడి ఎద్దు మృతి చెందింది. ఎద్దు విలువ రూ.50 వేల వరకు ఉంటుందని, నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

అంబారిపేట్‌లో నాలుగు మేకలు..

కడెం: మండలంలోని అంబారిపేట్‌లో పిడుగుపాటుతో నాలుగు మేకలు, ఒక గొర్రె పిల్ల మృతి చెందింది. మృతి చెందిన జీవాల విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది.


కడెం: మృతి చెందిన మేకలు


తలమడుగు: మృతి చెందిన ఎద్దు వద్ద బాధిత రైతు

నీట్‌లో గుడిపేట విద్యార్థి ప్రతిభ


లగిశెట్టి సమన్విత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని గుడిపేటకు చెందిన లగిశెట్టి సుజాత, రాజ్‌గోపాల్ దంపతుల కుమార్తె సమన్విత తాజాగా ప్రకటించిన నీట్ ఫలితాల్లో 720 మార్కులకుగానూ 529 మార్కులు సాధించి సత్తా చాటింది. విద్యార్థినిని తల్లిదండ్రులతో పాటు స్థానికులు అభినందించారు.

టేకుచెట్లు నరికిన వ్యక్తికి 14 రోజుల రిమాండ్

జన్నారం: జన్నారం అటవీ డివిజన్‌లోని పైడిపెల్లి బీట్‌లో రెండు టేకు చెట్లు నరికిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జి ఎఫ్‌డీవో, మంచి ర్యాల డీఎఫ్‌వో శివ్ ఆశిష్ సింగ్ గురువారం తెలిపారు. ఈ నెల 1న పైడిపెల్లి బీట్‌లో వెడ్మ లక్ష్మణ్ అనే వ్యక్తి టేకు చెట్లను రంపెంతో కోసి పడగొట్టాడు. రేంజ్ అధికారి సుష్మారావు ఆధ్వర్యంలో విచారణ జరిపి నిందితున్ని గురువారం లక్సెట్టిపేట కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు డీఎఫ్‌వో తెలిపారు.

గుట్కా విక్రయిస్తే కఠిన చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: నిషేధిత గుట్కా విక్రయించినా నిల్వ ఉంచినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనిఖీల్లో భాగంగా బుధవారం రాత్రి డాల్డా కంపెనీ ప్రాంతంలో దాడులు నిర్వహించగా మహారాష్ట్రకు చెందిన మజా కంపెనీ టొబాకొను కల్తీ చేస్తున్నట్లు గుర్తించామన్నారు. యంత్రంతో పాటు ఇర్ఫాన్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారం రోజుల వ్యవధిలో రూ.25 లక్షల గుట్కాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. టూటౌన్ సీఐ అశోక్ మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు డాల్డా కంపెనీ ప్రాంతంలోని గుండావార్ రాకేష్ జిన్నింగ్ మిల్లులో తనిఖీలు చేపట్టి అక్రమంగా నిల్వ ఉంచిన రూ.4 లక్షల 40వేల గుట్కాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇర్ఫాన్‌ను అదుపులోకి తీసుకోగా, మరో వ్యక్తి రిజ్వాన్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్య

సారంగపూర్: జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ధని గ్రామానికి చెందిన కొప్పుల లక్ష్మి (51) కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. భర్త వెంకటరమణ గతంలోనే మృతి చెందగా ఉన్న ఒక్క కుమారుడు అవినాష్ ఉన్నత చదువుల నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. దీంతో సేవచేసేవారు లేక, ఒంటరితనం భరించలేక గురువారం ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.